# ఊరుచివర రాయి

గత నాలుగు సంవత్సరాలుగా ఆ బార్‌లో పనిచేస్తున్నాను. మా బార్‌కు మంచి పేరుంది. శని, ఆదివారాల్లో కిటకిటలాడుతుంటుంది. ఆరోజు శనివారం అనుకుంటాను, బార్ ఇంకా నిండలేదు. బాబూరావుతో పాటు మరో ముగ్గురు వచ్చారు. రెండు వారాల కొకసారి అతను వస్తుంటాడు. అతనితో పాటు ఒకళ్ళిద్దరు తప్పనిసరిగా ఉంటారు. అతను తాగడు, బిల్ మటుకు ఇస్తుంటాడు. అతనికి నలభయి సంవత్సరాలుంటాయేమో ఎర్రగా, పొడుగ్గా ఉంటాడు. నాకు టిప్ ఉదారంగా ఇస్తుంటాడు. అతను వచ్చినప్పుడు ఆ బల్ల నన్ను చూసుకొమ్మని మా మేనేజరు నన్ను పురమాయిస్తుంటాడు. చిన్నప్పుడు చాలా కష్టపడి పయికి వచ్చాడని విన్నాను. సివిల్ కాంట్రాక్టర్‌గా మంచి పేరుంది. బాగానే సంపాయించాడు. రెండు కార్లున్నాయి. మా కాలనీలోనే పెద్ద ఇల్లు కట్టుకొన్నాడు. ఇద్దరు పిల్లలనుకుంటాను.

బార్‌లో అతనితో నేను ఎక్కువసార్లు చూసిన వ్యక్తి రాంబాబు. బాబూరావు, రాంబాబు ఒక ఊరు వాళ్లనుకుంటాను, వాళ్ళ సంభాషణల్లో ఆ ఊరి సంగతులు దొర్లుతుండేవి. అతనికంటే రాంబాబు చిన్నవాడయినా అతన్ని 'ఏరా' అని సంబోధిస్తుంటాడు. చులకనచేసి మాట్లాడేవాడు. రాంబాబుతో రావడం అతనికి అయిష్టంగా ఉన్నట్లు నా మటుకు నాకు అనిపిస్తుండేది. సెషన్ అయిపోయేవరకు ఇబ్బందిగా కూర్చునేవాడు. ఖర్చు బాబూరావుదే. సామాన్యంగా బాబూరావుతో ప్రభుత్వ ఉద్యోగస్తులు వస్తుండేవారు. అప్పుడప్పుడు తోటి కాంట్రాక్టర్లు వచ్చేవారు. అప్పుడు మటుకు ఖర్చు వాళ్ళలో ఎవరో ఒకరు భరించేవారు.

ఆ సాయంత్రం బాబూరావు. రాంబాబులతో పాటు వచ్చిన వ్యక్తులను మునుపు మా బార్‌లో ఎప్పుడూ చూసినట్టు గుర్తులేదు. వాళ్లు తాగే బ్రాండుబట్టి ఇచ్చే టిప్‌ల

బట్టి మాకు గుర్తుంటారు. రాంబాబుతో వచ్చిన సమస్య ఏమిటంటే మూడు పెగ్గులు వేసుకున్నాక అర్థంలేని విషయాలు అందరికీ వినబడేలా మాట్లాడుతుంటాడు. నాలుగో పెగ్గు పడితే ఎవరయినా సహాయం చేస్తేగాని నడిచే స్థితిలో ఉండడు. ఒకటో, రెండు సార్లో ఎక్కువ తాగినట్టున్నాడు, మెట్లమీద వాంతి చేసుకున్నాడు. రాంబాబుతో వచ్చినవాళ్ళు బాబూరావుకు కూడా కొత్త అనుకుంటాను, వాళ్ళు కూర్చున్న తర్వాత గాని రాంబాబు అతనికి పరిచయం చేయలేదు. పరిచయం చేస్తున్నప్పుడు ఆర్డర్ తీసుకోడానికి నేను బల్ల దగ్గరే నుంచున్నాను.

"ఇతని పేరు శాస్త్రి. డి.ఇ.ఓ. ఆఫీసులో పనిచేస్తున్నాడు. నాకు బాగా తెలిసినవాడు. టీచర్ల పెన్షన్‌లు అవీ చూస్తుంటాడు. ఊరకనే కాదు. రోజుకు ఒకసారికన్నా ఎక్కువసార్లు మందుకొట్టడు. నీకు ఏవిధంగానూ ఉపయోగపడడు" అన్నాడు రాంబాబు.

ఈ పరిచయాల మీద బాబూరావుకు ఎటువంటి ఆసక్తి ఉన్నట్టు అనిపించలేదు. "మీకేం కావాలో చెప్పండి" అన్నాడు.

"ఏమిట్రా ఆ తొందర?" విసుగ్గా అన్నాడు రాంబాబు.

బాబూరావు నా వంక చూస్తూ, "పాపం ఆ కుర్రాడు ఆర్డరు కోసం అయిదు నిమిషాల నుండి ఎదురుచూస్తూ నిలబడి ఉన్నాడు. అదీ కాకుండా నేను మీతో ఎక్కువసేపు కూర్చోలేను" అన్నాడు.

"ఎందుకో?"

"ఎనిమిదిన్నరకు నాకు వేరే పని ఉంది.నువ్వు మందు ఇప్పించమంటే కాదనలేక తీసుకువచ్చాను".

"మా కోసం అక్కడకు వెళ్ళడం మానేయి".

"వీలుకాదు... చెప్పండి... ఇంకేమేమి తీసుకుంటారు?"

రాంబాబు నా వంక ఎగాదిగా చూసి, "వీడు నీ శిష్యుడే కదరా, చెప్పేవరకు ఆగుతాడులే. ఇహ ఈ రెడ్డి గురించి చెప్తాను విను. అన్నల పుణ్యమా అని వాళ్ల ఊళ్లో బతకలేక బిచాణా ఎత్తేసి ఉన్నదంతా అమ్ముకుని వీడి తండ్రి ఇక్కడికొచ్చి స్థిరపడిపోయాడు. తంతే గారెల బుట్టలో పడ్డట్టయిందనుకో.. వస్తూ అదృష్టం తోడు తెచ్చుకున్నారేమో తెలియదు. ఇక్కడకొచ్చి బాగానే సంపాయించుకున్నారు.

రెడ్డికి మునిసిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగం. పేరుకే అది. నిజంగా చేసేది ప్లాట్లు, ఫ్లాట్ల పని. ఆఫీసు సమయంలోనే చేస్తుంటాడు. వీడు ఎంతో కొంత నీకు సహాయపడొచ్చు. వీడితో వచ్చిన సమస్య ఏమిటంటే నీకు ఎటువంటి సమస్యలు లేకపోతే సృష్టిస్తాడు. సమస్యలుంటే జటిలం చేస్తుంటాడు...” అంటోంటే అందరూ నవ్వాక అందరి తరఫున వాళ్ళకేమేమి కావాలో చెప్పాడు రాంబాబు. లిస్టు పెద్దగానే ఉంది. అతని సంగతి నాకు తెలుసు. తాగాక తెప్పించ్చిందల్లా తినడు. చాలా వదిలేస్తాడు.

ముందు మందు తీసుకొచ్చి తర్వాత తినడానికి వాళ్ళు ఏమేమి చెప్పారో తెచ్చి బల్లమీద అమర్చాను. వాళ్ళు మొదలుపెట్టారు. బాబూరావు మటుకు సెల్‌లో ఎవరితోనో చాలాసేపు మాట్లాడుతూ ఉండిపోయాడు. వాళ్ళు ముగ్గురు తమలో తాము మాట్లాడుకుంటూ అతని సంగతి మర్చిపోయినట్టున్నారు. వాళ్ల సంభాషణలో జోక్యం చేసుకోవడం అతనికి ఇష్టం లేదేమో ఆతర్వాత పక్కబల్ల మీదున్న దినపత్రిక అందుకుని సాఫ్ట్ డ్రింక్ కొద్దిగా తీసుకుంటూ తిరగవేయడం మొదలెట్టాడు. బల్లమీదున్న నిండుసీసా ఖాళీ అవుతోంది.

ఎనిమిదీ నలభయికనుకుంటాను. దినపత్రిక మడిచి నాకు అందించి సెల్‌లో ఎవరికో ఫోను చేసి, “వచ్చేస్తున్నా” అని లేచి నిలబడ్డాడు బాబూరావు. అతను లేచి నిలబడగానే వాళ్ల మాటలు ఆగిపోయాయి. రాంబాబు ఖాళీ చేసిన గ్లాసు చేతిలోనే పట్టుకుని, “వెళ్తున్నావురా?” అడిగాడు. అతని మాటలు ముద్దగా ఉన్నాయి.

“ఎనిమిదిన్నరకి వెళ్ళిపోవాలని ముందే చెప్పాను కదా?”

“బిల్లు ఎవడు కడ్తాడు. నీ బాబా?”

“బిల్లు నేనే కడ్తాను.”

“మాకు ఇది చాలదు. ఇంకా కావాలి”

“ఏం కావాలో చెప్పి తెప్పించుకోండి. బిల్లు సంగతి నాకు వదిలేయండి.”

“వెళ్ళిపోతున్నావు కదా?”

“కౌంటర్‌లో చెప్పి వెళ్తాను. మీరు కానీయండి” అని నా వంక చూసి, “వీళ్లకేం కావాలో తీసుకొచ్చి ఇవ్వు. బిల్లు కౌంటర్‌లో ఇవ్వు” అని టిప్ నా చేతిలో పెట్టాడు. తలూపాను.

"వెళ్దూకాని, రెండు నిమిషాలు కూర్చోరా. మా వాళ్లను నీకు పరిచయం చేశాను కాని మా వాళ్ళకు నిన్ను పరిచయం చేయలేదు. రెండు నిమిషాల కంటే ఎక్కువ తీసుకోను. .. కూర్చోమంటుంటే...." అన్నాడు రాంబాబు. మందు మాట్లాడడం మొదలెట్టింది అనుకుంటాను.

చేతి గడియారం వంక ఒకసారి చూసుకుని బాబూరావు కూర్చుని రాంబాబు ముఖంలోకి చూశాడు. రాంబాబు సిగరెట్ వెలిగించుకోబోతూ ఆగి, "మేం మజా చేస్తోంటే, నీకు కడుపు మంటగా ఉందా?" అడిగాడు.

"లేదు."

"నీకు కాస్త పేరు రాగానే కొమ్ములు మొలుచుకువచ్చాయిరా" అని సిగరెట్ వెలిగించుకున్నాడు. ఆరిపోని అగ్గిపుల్ల అతని ఒడిలో పడిందో, కుర్చీలో పడిందో విదిలించాడు.

"మనం మనం ఏదో మాట్లాడుకుంటూ ఉండిపోయి వీడి సంగతి మీకు చెప్పడం మర్చిపోయాను. నాదీ వీడిదీ ఒకే ఊరు. చిన్నప్పుడు ఒకే బడిలో చదువుకున్నాం. వీడి అయ్యా గవిడిగేదెలా ఉండేవాడు. చాలా సంవత్సరాలపాటు మా ఇంట్లో పాలేరుగా ఉన్నాడు. వీడి అయ్య నాలుగు పూటల భోజనం ఒక్క పూటలో లాగించేవాడు. వాడికి వండలేక మా అమ్మ తెగ విసుక్కునేది. అయినా తప్పేది కాదు. వీళ్ళింట్లో అయిదో తరగతి వరకు చదువుకుంది వీడే అనుకుంటాను. ఒకటీ రెండు సంవత్సరాల పాటు ఊళ్ళో వాళ్ళ గొడ్లు కాసేడు. రాంబాబు ఆగి, ఒక పెగ్ గ్లాసులో పోసుకుని సోడా కలుపుకుని నాలుగు గుక్కల్లో గ్లాసు ఖాళీచేసి బల్లమీద పెట్టాడు. వేళ్ళ మధ్య ఉన్న సిగరెట్ జారి బల్లకింద పడింది. అందుకోడానికి ప్రయత్నించాడు. కాని దొరకలేదు. పక్కబల్ల కిందకు వెళ్ళింది. రాంబాబు తిరిగి మొదలెట్టాడు. "వీడు ఇప్పుడు ఇంత నీటుగా ఉంటున్నాడు కాని చిన్నప్పుడు వేసుకోడానికీ సరయిన బట్టలుండేవి కావు. మా నాన్నకు తెలియకుండా నా పాతబట్టలు అమ్మ ఇస్తుండేది. ఒకసారి ఎవరిదో గేదె ఎక్కడికో వెళ్ళిపోతే వీడి అశ్రద్ధవల్లనే అది తప్పిపోయిందని వీడిని చెట్టుకుకట్టేసి గొడ్డును బాదినట్లు బాదుతుంటే వీడి అయ్య కూడా అడ్డం రాలేదు. చివరకు మా అమ్మ వెళ్ళి అడ్డుకుంటే కాని మునసబు వీడిని కొట్టడం ఆపలేదు. ఆ తర్వాత గొడ్లు కాయడం మానేశాడు. ఇప్పుడింత

కాంట్రాక్టరయ్యాడంటే, నాలుగు డబ్బులు వెనకేసుకున్నాడంటే ఒక విధంగా కారణం నేను. నేను నలుగురయిదుగురు పెద్దవాళ్ళకు పరిచయం చేసి, మార్గాలు చూపించి, చేయూత ఇచ్చి ఉండకపోతే వీడు ఇంతటివాడు అయి ఉండేవాడు కాదు. వీడు కష్టపడలేదని కాదు. పయికి రావడానికి కష్టపడ్డాడు. అదృష్టం కూడా కలిసివచ్చింది.....” చుట్టుపక్కల బల్లల చుట్టూ కూర్చున్నవాళ్ళు ఆసక్తిగా వింటున్నారు. అందరూ వినాలనే అతను అంత పెద్దగా మాట్లాడుతున్నాడనుకుంటాను.

నిజమయినా, కాకపోయినా రాంబాబు ఎప్పటి విషయాలో ఆ సమయంలో చెప్పడం నాకు మంచిగా అనిపించలేదు. ఎప్పటినుండి బాబూరావు మీద కసి పెంచుకుంటున్నాడో, ఆ అసహ్యమంతా వెళ్లగక్కేస్తున్నట్లుగా ఉంది. బాబూరావు కోపంతో లోలోపల ఉడికిపోతున్నాడేమో బయట పడడం లేదు. శాంతంగా ఉన్నాడు. ముఖంమీద నవ్వు బిగుసుకుపోలేదు.

రాంబాబు లేచి నిలబడబోతోంటే శాస్త్రి అతని చేయి పట్టుకుని కూర్చోబెట్టబోతోంటే, చేయి విదిలించుకొని... “శాస్త్రీ, నవ్వుండరా... మొదలెట్టాను కదా.... చెప్పడం పూర్తి చేయనీయరా... ఎంతవరకు చెప్పాను?” అడిగాడు.

శాస్త్రి జవాబు చెప్పలేదు. రెడ్డి తనకేం పట్టనట్టు మందు నింపాదిగా తాగుతున్నాడు. బాబూరావు మాటిమాటికీ చేతి గడియారం వంక చూసుకుంటున్నాడు. అవతల ఎంత అత్యవసరమయిన పనుందో?

“ఏదో చెప్పబోయి మర్చిపోయాను... గుర్తొచ్చింది. అప్పట్లో ఆదివారం వస్తే వీళ్లకు పండగే పండగ. గొడ్డును కోసేవాళ్ళు. కువ్వలు వేసేవాళ్ళు. కువ్వలు వేయడంలో వీడు నేర్పరి అని వీళ్ళ వాడెవడో నాకు చెప్పాడు. తక్కువ వాడేం కాదు. లీడర్‌షిప్ క్వాలిటీస్ చిన్నప్పటినుండి ఉన్నాయి. రెండు పూటలా కూర వండగా మిగిలిన మాంసపు ముక్కల్ని ఇంటి బయట తాడుకట్టి ఎండవేసేవాళ్ళు. ఎండిన మాంసపు ముక్కల్ని ‘వరికీళ్ళు’ అనేవాళ్ళు. వీడి జేబులో కాల్చిన వరికీళ్లు ఎప్పుడూ ఉండేవి. ఒక్కోటి తీసి జీళ్లు నమిలినట్లు నమిలేవాడు...” రాంబాబు చెప్పుకుపోతున్నాడు. బతికి ఉండగానే బాబూరావు చర్మం వలుస్తున్నట్టుగా అనిపిస్తోంది.

అతను చెప్పడం ఆపాక బాబూరావు రాంబాబు చెప్పిన స్థాయిలో “నేను పయికి రావడంలో రాంబాబుగాడి ప్రమేయం ఏమీలేదు. నాకు ఎప్పుడూ ఎటువంటి

సహాయం చేయలేదు. నేను వేరేవాళ్ళతో పనుండి వాళ్ళ ఆఫీసుకు వెళ్ళి వీడి కంటబడితే చాలు. వందో, రెండొందలో అడిగి తీసుకొనేవాడు. అప్పుడప్పుడు మందు కొట్టించమని వెంటబడేవాడు. కాదనలేపోయేవాడిని. నా చిన్ననాటి విషయాలు చెప్పాడు. ఏవీ అబద్ధాలు కాదు, నూటికి నూరుపాళ్ళు నిజమే చెప్పాడు.

అప్పట్లో కాదు, ఇప్పటికీ ఆదివరాం వచ్చిందంటే మా గూడెంలో గొడ్డును కోసి సంబరంగానే గడుపుకుంటుంటాం. ఆ మాటకొస్తే నేనూ తింటుంటాను. ఎప్పటినుండో వస్తున్న అలవాటు. సిగ్గు పడవలసిన విషయం అని నేను అనుకోను. ఈ పట్టణంలో కొన్ని హోటళ్ళలో, ఫైవ్‌స్టార్ హోటళ్ళలో, అమెరికన్ పిజ్జాలలో ఇది ఉంటుంది. మాట వచ్చింది కాబట్టి చెబుతున్నాను. ఈ మాట సంవత్సరం కిందట నాకు తెలిసింది. రాంబాబుగాడు పదహారు అణాల మావాడే. కాకపోతే అటు పుట్టాడు... " అంతకు మించి చెప్పడానికి ఏమీ లేదన్నట్లు అందరి ముఖాల్లోకి చూసి సెల్ అందుకుని బయటకు వెళ్ళిపోయాడు.

❖ ఆదివారం వార్త, **10 ఫిబ్రవరి, 2008**